ఖనిలో ఘనంగా పూలే అంబేద్కర్ జ్ఞానమాల

నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కోల్‌సిటీ, జనవరి 5 : ఆలిండియా అంబేద్కర్ సంఘం, ఆలయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలె అంబేద్కర్ జ్ఞానమాల ఘనంగా చేపట్టారు. పలు సంఘాల బాధ్యులు హాజరై మహనీయులు అంబేద్కర్, పూలె విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ భారత రాజ్యాంగంను ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయనీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు రాజ్యాంగమే కారణమన్నారు. సకల జనులకు రక్షణగా, ఉన్న భారత రాజ్యాంగంను కాపాడుకోవాల్సినవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. త్యాగధనుల ఆశయాలను గ్రామ గ్రామానికి అన్ని వర్గాలకు తీసుకవెళ్లాల్సినవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి దాస్, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేశ్ బాబు, బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, మైస రాజేశ్, సతీశ్, మంతెన లింగయ్య, శనిగరపు రామస్వామి, దుబాసి బొందయ్య, గద్దల శశిభూషణ్, కాసిపాక రాజమౌళి, బూడిద మహేందర్, నర్సింగరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మనోహర్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

ఓదెల, జనవరి 5 : ఓదెల మండల కేంద్రంలో మూడు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించే విధంగా తనవంతుగా సహాయ, సహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు పేరు ప్రతిష్టలు తెచ్చుకోవడానికి దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనికిరెడ్డి సతీశ్, ఐరెడ్డి కిషన్‌రెడ్డి, వస్త్రంనాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లఘు చిత్రంగా 'శ్రీకృష్ణ సత్య'

కరీంనగర్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రత్యేక బహుమతి అందుకుంటున్న షార్ట్ ఫిలిం డైరెక్టర్ వేముల అశోక్

కోల్‌సిటీ, జనవరి 5: గోదావరిఖనికి చెందిన అమెజింగ్ స్టార్ వేముల అశోక్ కరోనా క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించి, నటించిన శ్రీ కృష్ణ సత్య అనే లఘు చిత్రం ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో ఉత్తమ లఘుచిత్రంగా కలెక్టర్ పమేల సత్పతి, తెలంగాణ సాంస్కృతిక రథసారథి చైర్మన్ వెన్నెల చేతుల మీదుగా వేముల అశోక్ బహుమతిని అందుకున్నారు. తన చిత్రంను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 51 లఘు చిత్రాలను పోటీకి పంపించగా, అశోక్ నటించి నిర్మించిన చిత్రం ఎంపిక కావడం విశేషమని గోదావరిఖని కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి విజయంను అందించిన చిత్రం బృందంకు అశోక్ అభినందనలు తెలిపారు.

గట్టెపల్లి గ్రామ కమిటీ నియామకం

సుల్తానాబాద్‌రూరల్, డిసెంబర్ 5 : మందకృష్ణ మాదిగ, రాష్ట్ర నాయకులు గుండా థామస్ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ సుల్తానాబాద్ మండలాధ్యక్షుడు రుద్రరపు శ్రావణ్, కనుకం శంకర్ ఆధ్వర్యంలో మండలంలోని గట్టెపల్లి గ్రామ కమిటీని ఆదివారం ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రుద్రారం శ్రామ్, ఉపాధ్యక్షుడు ఇంజపురి దేవదాస్, ప్రధాన కార్యదర్శి రుద్రారం రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి గుండేటి హరికృష్ణ, 14 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఇంజగిరి వివేక్, లంకదాసరి రంగస్వామి ఉన్నారు.

33వ డివిజన్‌ను సింగరేణి దత్తత తీసుకోవాలి

గోదావరిఖని, జనవరి 5: సింగరేణి ఆర్జీ-1 పరిధి ఓసీపీ 5 ప్రభావిత 33వ డివిజన్‌ను సింగరేణి దత్తతు తీసుకొని అభివృద్ధి చేయాలని సింగరేణి భవన్‌లో సీఎండీ పెషిలో వినతిపత్రం అందజేసినట్లు ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ తెలిపారు. అలాగే ఓబీలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు, హిందూ శ్మశాన వాటికలో ఉచిత దహన సంస్కారాలకు చర్యలు, ఇతర సమస్యలపై వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక శిక్ష..

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 5 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు ఆదివారం గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖానలో రోగులకు పండ్ల పంపిణీ, దవాఖాన ఆవరణను శుభ్రపరిచి సామాజిక సేవ శిక్ష అమలు జరిగింది. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కుమార్ కొంతకాలంగా నిర్వహించిన డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన పది మంది వాహనదారులను గోదావరిఖని ప్రిన్సిపాల్ మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్‌రెడ్డి ముందు హాజరుపరుచగా, మేజిస్ట్రేట్ జరిమానాతో పాటు వారికి సామాజిక సేవ శిక్ష విధించడంతో ఎస్ఐ వారితో సేవాశిక్షను అమలు పరచారు.

టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా రాయుడు

టీజీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ సభ్యులు

పెద్దపల్లి, జనవరి 5 : తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా రాపెల్లి రాయుడు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీనివాస్(నాయబ్ తహసీల్దార్, పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం), ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ అనిల్ కుమార్(జూలపల్లి నాయబ్ తహసీల్దార్), మహిళా అధ్యక్షురాలిగా బీ లక్ష్మి (నాయబ్ తహసీల్దార్, పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం), అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఎస్ గిరి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, అరుణ్, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయారు. అంటెండర్ నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ప్రతి రెవెన్యూ ఉద్యోగి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని నూతన జిల్లా అధ్యక్షుడు రాయుడు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జూలపల్లి, జనవరి 5 : రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పోటీలకు జూలపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. పెద్దపల్లిలో ఇటీవల టీఎస్ ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో గుంటి అనూష, ద్వితీయస్థానంలో మహ్మద్ సోహెల్, తృతీయస్థానంలో పెంట సాయిప్రసాద్ నిలిచారు. ఎంఈవో సరస్వతి, సాంఘీకశాస్త్ర బోధకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఓపెన్ టెన్త్ ఇంటర్ తరగతుల పరిశీలన

మంథని, జనవరి 5 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మంథనిలో జరుగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసరావు పరిశీలించారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ టెన్త్ ఇంటర్ మంచి అవకాశమని వినియోగించుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలన్నారు. తరగతులకు హాజరైన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు దొంతుల కుమార్, పోచయ్య, కేశవులు, విజయకుమార్ పాల్గొన్నారు

కార్యవర్గం..

జూలపల్లి, జనవరి 5 : జూలపల్లిలో హనుమాన్ ఆలయం వద్ద ' శ్రీ దుర్గాభవాణి మాత' సేవా సమితి కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడుగా కనపర్తి భానుచందర్, ఉపాధ్యక్షుడుగా నగునూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాటకుల అనిల్, కార్యనిర్వహన కార్యదర్శిగా పొలగాని సతీశ్, కోశాధికారిగా కనపర్తి రాజేశ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తాటికొండ వేణు, కోడూరి రాజేశ్వర్, మహేశ్, దేవసాని ఆంజనేయులు, మద్దెపెల్లి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

నిబంధనలు పాటించాలి

అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ మధు

పెద్దపల్లి, జనవరి 5 : రహదారి భద్రత నిబంధనలు పాటించాలని పెద్దపల్లి ఏఎంవీఐ మధు ఆటో డ్రైవర్లకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో ఆటో డ్రైవర్లకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యూత్ ఆఫీసర్ రాంబాబు

సుల్తానాబాద్, జనవరి 5 : మానసిక, శారీరక వికాసానికి క్రీడల దోహద పడుతాయనీ జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో బ్లాక్ లెవల్ వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడువకుండా సన్మార్గంలో నడువాడనికి క్రీడలు దోహద పడుతాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ఎజిపి దూడం అంజనేయులు, అమిరిశెట్టి తిరుపతి జిలాని, సత్యం సతీష్, మహేశ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ అంబేద్కర్ సంఘం ఎన్నిక

సుల్తానాబాద్, జనవరి 5 : సుల్తానాబాద్ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అరెపల్లి రాహుల్, ఉపాధ్యక్షులుగా న్యాతరి కాలిచరణ్, కల్వల రాజు, అరెపల్లి రాకేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎ. వెంకటేష్, చిలుములు ప్రదీప్‌కుమార్, కల్వల సతీష్, సంయుక్త కార్యదర్శులుగా తాండ్ర ప్రశాంత్, అరెపల్లి కిషోర్, మామిడి తిరుపతి, కోశాధికారిగా న్యాతరి మోహన్, అరెపల్లి ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా సలిగంటి శివకుమార్, చిటికల పరమేష్, కాంపల్లి శ్రీనివాస్, కొండ్ర వినయ్, మచ్చ దిలీప్ తదితరులును ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాహుల్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పజెప్పిన భాద్యతను తూచ తప్పకుండా పాటిస్తూ, సంఘం అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకుపోతామన్నారు. మా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

దొంగతుర్తి మండల ఏర్పాటుకు సంతకాల సేకరణ

సంతకాలు చేస్తున్న గ్రామస్తులు

ధర్మారం,డిసెంబర్5 : ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం నుంచి గ్రామస్తులు సంతకాల సేకరణ చేపట్టే ప్రక్రియ మొదలైంది. ఇటీవల కొత్త మండలం ఏర్పాటు గురించి గ్రామంలో కుల సంఘాల అధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అట్టి సమావేశ నిర్ణయం మేరకు మండలంలోని కొన్ని గ్రామాలను,ఇతర మండలాలలోని కొన్ని గ్రామాలను కలిపి దొంగతుర్తిని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజలు సంతకాలు ఆదివారం నుంచి సంతకాలు చేస్తున్నారు.

ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జ్యోతినగర్, జనవరి 5 : ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం ఢిల్లీలో ఎన్టీపీసీ హెచ్ఆర్ డైరెక్టర్ జాడ్లిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఫిట్‌నెస్ కలిగిన కార్మికులను 65 ఏండ్ల వరకు కొనసాగించాలని, సూపర్‌స్పెషాలిటీ దవాఖానలో వైద్య చికిత్సను అందించాలి, కార్మికుల పిల్లలకు కార్పొరేట్ తరహాలో ఉచిత బోధన, క్రీడల కోసం ఆధునిక స్టేడియం నిర్మాణం, మెయిన్‌రోడ్‌లోని సర్వీస్‌రోడ్‌ను రామగుండం తహసీల్దార్ కార్యాలయం వరకు పొడగించి పూర్తి చేయాలన్నారు. అలాగే ఇతర కార్మిక సమస్యలపై ఎమ్మెల్యే చర్చించి వినతిపత్రం అందజేశారు.

విహారయాత్రలో ఐఏఎస్ విద్యార్థులు

కోల్‌సిటీ, జనవరి 5 : గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్ (ఐఏఎస్) విద్యార్థులు విహార యాత్రకు బయలుదేరి వెళ్లారు. పాఠశాల డైరెక్టర్ పేరం హేమలత శ్రీకాంత్ జెండా ఊపి విహార యాత్రను ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు సిద్ధాంతంను కంటే ప్రయోగాత్మక అనుభవం అందిస్తాయనీ, ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విజ్ఞానాన్ని అర్థం చేసుకోవడం సులభమన్నారు. చారిత్రక ప్రదేశాలను సందర్శించడం ద్వారా సాంస్కృతిక, భౌగోళిక, సామాజిక అంశాలను, ప్రపంచంలోని వైవిధ్యాలను అర్థం చేసుకుంటారన్నారు. ఇందు కోసమే తమ పాఠశాల విద్యార్థులను విశాఖపట్నం, అరకు, అరుణాచలం, సింహాచలం, కైలాస గిరి, బొర్రా గుహలు, అన్నవరం తదితర ప్రసిద్ధ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలిపటాల దుకాణాల తనిఖీ

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 5 : రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకోని గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, మార్కండేయకాలనీలోని గాలిపటాల దుకాణాలను ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల తనిఖీలు నిర్వహించారు. గాలిపటాలకు ఉపయోగించే మంజా దారం అమ్మకాలపై తనిఖీ చేసిన పోలీసులు ప్రమాదకరమైన మంజా దారంను అమ్మకాలు చెపట్టరాదన్నారు. మంజాదారం అమ్మకాలు జరిపిన గాలిపటాలతో ఎగురవేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మాట్లాడుతున్న ఎస్ఐ రమేశ్

ఓదెల, జనవరి 5 : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ కోరారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లతో సమావేశం ఏర్పాటే చేసి మాట్లాడారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట విరుద్ధంగా పని చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు

బైక్ చోరీ

ముత్తారం, జనవరి 5: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి బైక్ దొంగతనం జరిగింది. బాధితుని వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన సల్వాల రాజు శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంతో తన బైక్ టీఎస్ 02 ఈఎన్ 2120 గల హీరో గ్లామర్ ఇంటి ముందు పెట్టానని ఉదయం చూడగా తన బైక్ కనిపించలేదని తెలిపాడు. ఎక్కడ వెతికినా దొరకకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

33వ డివిజన్‌ను దత్తత తీసుకోవాలి

కోల్‌సిటీ, జనవరి 5 : సింగరేణి ఓసీపీ-5 ప్రభావిత ప్రాంతమైన గోదావరిఖని 33వ డివిజన్‌ను యాజమాన్యం దత్తత తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ కోరారు. ఈమేరకు సింగరేణి సీ అండ్ ఎండీ పేషీలో ఆదివారం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఓసీపీ-5 ప్రాజెక్టు విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణలో యాజమాన్యం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి బొగ్గు ఉత్పత్తిపై మాత్రమే శ్రద్ధ చూపుతుందనీ, దీంతో నిత్యం మోతాదుకు మించి చేపడుతున్న బ్లాస్టింగ్‌ల వల్ల సమీపంలోని 33వ డివిజన్ ఫైవింక్లయిన్ కాలనీ, పరశురాంనగర్, జవహర్‌నగర్‌లో కార్మికుల నివాస గృహాలు దెబ్బతినడంతోపాటు నిత్యం బొగ్గు, దుమ్ము,ధూళి వెదజల్లడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పర్యావరణ విధ్వంసం మూలంగా సమీప డివిజన్ ప్రజలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఓసీపీలోని ఓబీ కంపెనీల్లో స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై స్థానికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. వెంటనే ఈ డివిజన్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సీఎండీని కోరారు. లేనిపక్షంలో ఓసీపీ-5లో స్థానిక ప్రజలతో కలిసి బొగ్గు ఉత్పత్తి పనులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి

కమాన్ పూర్ , జనవరి 5 : ప్రతి పేదవారిని ఆదుకోవడమే మనందరి విధి అని కమాన్‌పూర్ లయన్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి సత్య సాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ నూక రమేశ్ అన్నారు. ఆదివారం కమాన్‌పూర్ మండల కేంద్రంతో పాటు తదితర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్, సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అమృత కళాశాలు అనగా బీదవారికి నెలసరి బియ్యం తదితర వస్తువులను అందజేశారు. సత్య సాయి కన్వీనర్ నూక రమేశ్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, లయన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, బుగ్గజి, తాటిపాముల శ్రీనివాస్, భాస్కర్, , లయన్ అనవేన లక్ష్మీరాజు, లయన్ జబ్బార్ ఖాన్ పాల్గొన్నారు.

'కొలనూర్ మండలంగా ఏర్పాటు చేయాలి'

ఓదెల, జనవరి 5 : మండలంలోని కొలనూర్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని బీఎస్పీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఓదెలలో విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర నాయకుడు సాత్తూరి అనిల్ మాట్లాడుతూ కొలనూర్‌ను మండలంగా చేయడానికి అన్ని అర్హతలు ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా కొలనూర్ మండలంగా చేయడం వలన పలు గ్రామాలకు పాలన సౌలభ్యంగా ఉంటుందని జిల్లా అధికారులు ప్రతిపాదనలు కూడా తయారు చేసినా, అప్పటి పరిస్థితుల కారణంగా కాలేపోయిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొత్త మండలాల ప్రతిపాదన జరుగుతున్న తరుణంలో కొలనూర్‌ను కూడా మండలం చేయాలన్నారు. కొలనూర్‌ను మండలంగా చేయకుంటే ఉద్యమిస్తామని తెలిపారు. ఇక్కడ నాయకులు పల్లె రాకేశ్, మాటూరి నర్సయ్య, పులిపాక మహేశ్ ఉన్నారు.

ఉపాధ్యాయుల ఓరియెంటేషన్ కార్యక్రమం

గోదావరిఖని, జనవరి 5: సింగరేణి పాఠశాలకు సంబంధించి ఆదివారం ఆర్జీ-1 ఇల్లందు క్లబ్‌లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం ఫర్ ఆల్ స్కూల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించగా, గోదావరిఖని సెక్టార్-2, 3, సీసీసీ, మందమర్రి, గోలేటి, భూపాలపల్లి సింగరేణి పాఠశాలల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. డీజీఎం పర్సనల్ అధికారి డీ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, ఏజెంట్ 11 గ్రూప్ చిలుక శ్రీనివాస్, మోటివేటర్ శ్రీసింగ్ రాజు, డాక్టర్ లక్ష్మీవాణి, పాఠశాలల కరస్పాండెంట్, హెచ్ఎం బీ శ్రీనివాస్ ఉన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- కమ్మర్‌ఖాన్‌పేట్‌లో క్రికెట్ లీగ్ విజేతలకు బహుమతుల ప్రదానం

క్రీడాకారులతో విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మారం, జనవరి 5 : క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. మండలంలోని కమ్మర్‌ఖాన్‌పేట గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో అన్నారం జట్టు విజేతగా నిల్వగా కమ్మర్‌ఖాన్‌పేట జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ క్రమంలో ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించగా, విప్ లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత జట్టుకు రూ. 30 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదును ట్రోఫీలను క్రీడా జట్లకు అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో క్రికెట్ టోర్నీని నిర్వహించిన నిర్వాహకులను లక్ష్మణ్‌కుమార్ అభినందించారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, క్రికెట్ టోర్నీ నిర్వాహకుడు మహంకాళి ప్రణవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

జూలపల్లి, జనవరి 5 : పెద్దాపూర్‌లో మాజీ వార్డు సభ్యుడు గూడూరి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం వాలీబాల్ క్రీడా సామగ్రి అందజేశారు. భవిష్యత్‌లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి చేయూతనిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు కల్లెపెల్లి ఉమేందర్, కిషన్, రాజు, స్వామి, లచ్చయ్య, కల్లెపెల్లి రాయమల్లు పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తా

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న శ్రీధర్ బాబు

రామగిరి, జనవరి 5 : మండలంలోని బేగంపేట గ్రామాన్ని ఆనుకొని ఉన్న రామగిరి ఖిల్లాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తానని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం బేగంపేట గ్రామంలో పర్యటించారు. రామగిరి ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బేగంపేట, రత్నాపూర్ గ్రామాల నుంచి రామగిరి ఖిల్లాకు ఇరువైపులా రోడ్లు అభివృద్ధి చేయడం, ఖిల్లాపై మౌలిక వసతులు కల్పించడం కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

అభివృద్ధే లక్ష్యం

ముత్తారం, జనవరి 5 : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీల అమలుకు ముందుగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని ఆదివారం పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రైతన్న విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మంథని -ముత్తారం రోడ్డు నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం. మండలాధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు వాజీద్ పాషా, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్ల పంపిణీ

గోదావరిఖని, జనవరి 5 : రామగుండం నియోకవర్గ విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేద విశ్వ బ్రాహ్మణ మహిళలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఇక్కడ రామగుండం వోపా అధ్యక్షుడు నాగుల మల్యాల రాజమౌళిచార్యులు, ప్రధానకార్యదర్శి పానుగంటి స్వామి, కోశాధికారి పానుగంటి మారుతి, ఆలయ చైర్మన్ మామిడి భాస్కర్, ప్రభాకరాచారి, రవీంద్రాచారి, పొడిశెట్టి శంకరాచారి, ఉట్నూరి రాజయ్య ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గోదావరిఖని, జనవరి 5: అఖిల గాండ్ల తిలకుల సంఘం రామ గుండం నియోకవర్గ 2025 న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ ఆదివారం పట్టణంలో కులసంఘం నాయకులు జక్కం సత్యనారాయణ ఆవిష్కరించారు. ఇక్కడ సంఘం నియోకవర్గ అధ్యక్షుడు బొల్లం ఉమాశంకర్, గౌరవ అధ్యక్షుడు జక్కం మారుతి, లెక్కల శేఖరయ్య, పిల్లలమర్రి శ్రీధర్, పోతునూరి శ్రీధర్, చంద్ర శ్రీనివాస్, నులిగొండ రాధాకృష్ణ, అనిశెట్టి శ్రీనివాస్, రాసబత్తుల నర్సయ్య, లెక్కల రమేశ్, తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న పలువురి అరెస్ట్

సారంగాపూర్, జనవరి 5: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన జీ రాజేశం అలియాస్ సిద్ధు ఆదివారం గంజాయి తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధు గంజాయి తరలిస్తున్నాడనే పక్కా సమాచారంతో రేచపల్లి ఎక్స్‌రోడ్ వద్ద పట్టుకోగా అతని వద్ద 1050 గ్రాముల ఎండు గంజాయి దొరికినట్లు తెలిపారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సిద్ధును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, సిద్ధు గతంలోనూ పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనంలో గంజాయి దొంగతనం చేసిన కేసులో జైలుకు వెళ్లి బయటకు వచ్చాడని తెలిపారు. ముంబైకి వెళ్లి రెండు రోజుల క్రితం రేచపల్లికి వచ్చినట్లు చెప్పారు. ఇక్కడికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తుల వద్ద 1200 గ్రాముల గంజాయి కొని తీసుకువచ్చాడన్నారు. అందులో కొంత తాగి మిగితాది జగిత్యాల చుట్టుపక్కల అమ్మడానికి తీసుకెళ్తుండగా పక్క సమాచారంతో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ దత్తాద్రి పేర్కొన్నారు.

పెగడపల్లి, జనవరి 5: పెగడపల్లి మండలం నర్సింహునిపేట గ్రామ శివారులో పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో మల్యాల సీఐ నీలం రవి పర్యవేక్షణలో ఎస్ఐ రవికిరణ్, సిబ్బంది ఆదివారం నర్సింహునిపేట శివారులో నిర్మానుష్య ప్రదేశంలో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నలుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పెగడపల్లికి చెందిన వారు ముగ్గురు, కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి చెందిన వారు ఒకరు ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ముగ్గురి ప్రాణాలు తీసిన ప్రమాదం

- చికిత్స పొందుతూ మూడో వ్యక్తి మృతి

తిమ్మాపూర్, జనవరి 5: మండలంలోని మహాత్మానగర్‌లో రెండు కుటుంబాలకు చెందిన నలుగురు ఇటీవల వేములవాడ రాజన్న దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఇందులో పొలవేణి మంగ అక్కడికక్కడే మరణించగా.. ఆమె భర్త గట్టుబాబు చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. అలాగే తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మాశెట్టి అశోక్(60) సైతం ఆదివారం ఉదయం మరణించాడు. తీవ్రంగా గాయపడిన అశోక్ భార్య దవాఖానలో చికిత్స పొందుతున్నది. ప్రమాదంలో ఒకరితర్వాత ఒకరు వరుసగా ముగ్గురు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అశోక్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు.

విరాళాలతో అంత్యక్రియలు

వీణవంక, జనవరి 5: చల్లూరు గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు చెల్పూరి లక్ష్మి (75) మృతి చెందగా, మల్లారెడ్డిపల్లికి చెందిన అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరాళాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, సభ్యులు గడ్డం కుమారస్వామి, తాండ్ర లక్ష్మణ్, ఎలబాక నరేశ్, పరిపూర్ణాచారి, మొగిలి, ప్రకాశ్, అజయ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జూలపల్లి, జనవరి 5 : పెద్దాపూర్‌లోని 'ఆదర్శ' పాఠశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మహ్మద్ షాదుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 28 దాకా గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఏప్రిల్ 13న రాత పరీక్షలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆరో తరగతిలో వంద, ఏడు నుంచి పదో తరగతి వరకు మిగిలి ఉన్నసీట్లను భర్తీ చేస్తామన్నారు.

క్రీడాకారులకు టీ-షర్ట్‌ల పంపిణీ

ఓదెల, జనవరి 5 : ఓదెల మండల కేంద్రంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడుతున్న క్రీడాకారులకు బీఆర్ఎస్ నాయకుడు కనికిరెడ్డి సతీశ్ టీ-షర్ట్‌లను ఆదివారం అందజేశారు. ఈ టోర్నీలో ఓదెల గ్రామం నుంచి నాలుగు జట్లు ఆడుతున్నాయి. ఆ క్రీడాకారులకు టీ-షర్ట్‌లను సొంత డబ్బులతో కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. ఇందుకు క్రీడాకారులు సతీశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.